# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 98 | పేజీలు: 5 | వెల: రూ.4/- | శనివారం 6 డిసెంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## చంద్రబాబును కలిసిన మంత్రి కోమటిరెడ్డి

### గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వాన పత్రిక అందచేత

అమరావతి, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం) చంద్రబాబు విజన్‌కి తగ్గట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించేందుకు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా.. ఇప్పుడు చంద్రబాబును ఆహ్వానించడానికి వచ్చా. రెండు రాష్ట్రాలు కలిసి ఉండాలి.. అదే స్నేహం కొనసాగాలి. చంద్రబాబు విజన్ 2020 అభివృద్ధికి ప్రతిరూపం హైదరాబాద్ అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం కలిశారు.



## హైదరాబాద్ తరహాలో
# వరంగల్ అభివృద్ధి

### నర్సంపేటలో రూ.532 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
### ఉచిత విద్యుత్‌కు పేటెంట్ కాంగ్రెస్ మాత్రమే
### ప్రజాపాలన విజయోత్సవ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**వరంగల్, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం)**

బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండగా గత పదేళ్లలో భారీగా ఆస్తులు సంపాదించారు.. కానీ ఈ ప్రాంతం అభివృద్ధిని గాలికి వదిలేశారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ ఆనాడు వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం.. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ.. వరికి ప్రోత్సాహకాలిచ్చామని తెలిపారు. సన్న వడ్డుల పండిస్తే 500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ మా పార్టీదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పాలకులు ఫాంహౌస్ లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు.. ఉద్యమగడ్డ వరంగల్ కు మాత్రం ఏమీ ఇవ్వలేదని ఘాటు విమర్శలు చేశారు. గత పాలకులు రైతు రుణమాఫీ చేయలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసింది.. రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం.. 3 కోట్ల 10 లక్షల మందికి ఈ ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయం కోసం గత సీఎం కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టు ను కూడా సాధించలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వరంగల్ జిల్లా

..మిగతా 2లో

## అమెరికా ఆంక్షలు ఉన్నా
# చమురు రవాణా ఆగదు



భారత్‌తో బంధం మరింత బలోపేతం

భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం

ఇరుదేశాల మధ్య మరింత వాణిజ్య సహకారం

అమెరికా ఆంక్షలు ఉన్నా చమురు రవాణా ఆగదు

సొంత కరెన్సీలతో వ్యాపారానికి చేరువగా ఉన్నాం

అణువిద్యుత్ తదితర రంగాల్లో సహకారం కొనసాగిస్తాం

ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలసి నడుస్తాం

ఉక్రెయిన్‌తో యుద్ధంపై
మోడీ సూచనలు స్వాగతిస్తున్నాం

మోడీతో భేటీలో
సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం)**

టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌తో కలిసి నడుస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. 'మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది. అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇరుదేశాల మధ్య ట్రేడ్ మరింత పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకారం అందిస్తాం. ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకారం ఉంటుంది. సొంత కరెన్సీల్లో ఇరుదేశాల మధ్య వాణిజ్యం జరుగుతోంది. కొడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు సహకరిస్తాం. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గింపునకు సాయం అందిస్తాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌కు నిరంతరంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందని అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. వచ్చే ఏడాది భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందన్నారు. భారత్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. యుద్ధం ఆపే ప్లాన్ గురించి తనకు వివరించి చెప్పారని అన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ

..మిగతా 2లో

# అర్బన్ ఏరియాల్లో బహుళ అంతస్థుల నివాసాలు

### ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మా లక్ష్యం
### హిల్ట్ పాలసీపై కెటిఆర్‌వి అర్థం లేని విమర్శలు
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం)**

తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయించే బాధ్యత తీసుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. ఇక్కడ జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో నిర్మిస్తాం. మధ్యతరగతి వర్గాలకూ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. త్వరలో లక్ష ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు లక్షల ఇళ్లకు గృహప్రవేశం పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే ఏప్రిల్ నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పుకొచ్చారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ

..మిగతా 2లో



# ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు

### కేంద్రప్రభుత్వం ఆదేశం
### సర్వీసుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు
### కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం)**

ఇండిగో సంక్షోభంపై విచారణకు కేంద్రం ఆదేశించింది. సంక్షోభం నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు వెంటనే కేంద్రం రంగంలోకి దిగింది. నిర్వహణాపరమైన లోపాల కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దాంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతుండగా.. ఈ గందరగోళం ఇప్పుడప్పుడే కొలిక్కి వచ్చేలా కనిపించడం

..మిగతా 2లో




# హైకోర్టుకు క్షమాపణ

### హైడ్ర కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం)**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలంగాణ హైకోర్టుకు హాజరై క్షమాపణ చెప్పారు. బతుకమ్మకుంట కేసు విచారణలో భాగంగా ఆయన హాజరయ్యారు. ఈ కేసులో హైడ్రాపై ఎ.సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈక్రమంలో న్యాయస్థానం ఆదేశాలతో రంగనాథ్ శుక్రవారం కోర్టుకు వచ్చారు. గతంలోనే హాజరు కావాల్సి ఉండగా హాజరు కాలేదు. దీంతో హైకోర్టు తీవ్రంగా పరిగణించి ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ బతుకమ్మకుంట పరిధిలోని ప్రైవేటు స్థలానికి సంబంధించి యథాతథస్థితిని కొనసాగించాలని జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలంటూ సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అక్టోబరు 31న విచారించిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబరు 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే

..మిగతా 2లో

# సీఎం ఆదేశిస్తే రాజీనామా

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలు




**హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం)**

రాజీనామాపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజీనామా అంశాన్ని సీఎం నిర్ణయంతో ముడిపెట్టాడు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే రాజీనామా చేయమని వెనకాడనన్నారు. తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఫైట్ చేయడం, గెలవడం తన రక్తంలోనే ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌నగర్, నారాయణగూడలో రూ.1.40కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అనర్హత వేటు అంశంపై దానం స్పందించారు. రాజీనామా ప్రస్తావన ఇంకా రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. నాకు ఎన్నికలు కొత్త కాదు.. ఇప్పటికి 11 సార్లు కొట్లాడిన చరిత్ర ఉంది. అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. నా వాదనలు వినిపిస్తానని అన్నారు. రేవంత్‌రెడ్డి మరో పదేళ్లు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. రైజింగ్ తెలంగాణ కోసం తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని దానం నాగేందర్ అన్నారు.అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుతుందని గుర్తు చేశారు. 'సుప్రీంకోర్టులో అప్పీల్ చేశా.. కేసు కోర్టులో పెండింగ్ ఉంది.. స్పీకర్ దగ్గర కూడా అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉంది.. సుప్రీంకోర్టులో నా వైపు నుంచి వాదనలు వినిపిస్తా.. సందర్భాన్ని బట్టి రాజీనామాపై నిర్ణయం తీసుకుంటా.. సీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటా.. ఎన్నికలు ఎదుర్కోవడం నాకు కొత్తేం కాదు.. ఎన్నో ఎన్నికలు చూశా.. 11 సార్లు కొట్లాడిన చరిత్ర నాది. రేవంత్ రెడ్డి మరో పదేళ్ల పాటు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని వ్యాఖ్యానించారు.

# వీఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

### రద్దీ దృష్ట్యా టిటిడి కీలక నిర్ణయం



**తిరుమల, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం)**

తిరుమల తిరుపతి దేవస్థానం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. శ్రీవారి దర్శనానికి సుమారుగా 15 గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీ, పర్వ దినాల నేపథ్యంలో డిసెంబరు, జనవరిలో పలు రోజులు వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. ఈ మేరకు టీటీడీ శుక్రవారం ఓ ప్రకటన

..మిగతా 2లో

# "పుష్ప" విషాద విజయానికి ఏడాది



హైదరాబాద్, డిసెంబర్ 5(నమస్తే ఉదయం)

"పుష్ప " విషాద విజయానికి సరిగ్గా ఏడాది పూర్తి అయ్యింది. ఘటన జరిగి ఓ తల్లి తనువు చాలించారు, ఒక బిడ్డ బతుకు పోరాటం చేస్తున్నాడు. వెరసి చిత్రం భారీ విజయం వెనుక అత్యంత విషాదం దాగి ఉంది. ఏడాది అనగా డిసెంబర్ 4, 2024న హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఆ దారుణ తొక్కిసలాట ఇప్పటికి కళ్ల ముందు మెదులుతూనే ఉంది. అల్లు అర్జున్ 'పుష్ప 2: ది రూల్' ప్రీమియర్ షో చూడటానికి వచ్చిన ఒక సాధారణ కుటుంబం భాస్కర్, రేవతి, వారి పిల్లలు శ్రీతేజ్, సాన్విక. ఆ రోజు వారు ఇంటికి తిరిగి రాలేదు. పూర్తి కుటుంబంగా వెళ్ళి రేవతి (39) అక్కడే ప్రాణాలు విడిచింది. ఆమె కూతురు సాన్విక కంట తల్లి కనిపించకుండా పోయింది. కానీ బాధలు అక్కడితో ఆగలేదు. ఆమె కుమారుడు శ్రీతేజ్ (ఇప్పుడు 9 ఏళ్లు) ఇప్పటికీ మంచం మీద నిశ్చేష్టంగా పడి, బతుకు కోసం పోరాడుతున్నాడు.


**ఆ రాత్రి ఏమి జరిగింది ?**

అభిమానుల ఆవేశం,స్టార్ హీరో రాక, థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం అన్నీ కలిసి ఒక తల్లి ప్రాణాలు అనంత వాయువుల్లోకి తీసుకెళ్లాయి. రేవతి తన బిడ్డలను కాపాడుకోవడానికి ప్రాణాలు అర్పించింది. ఆమె చివరి క్షణాలు ఎంత బాధాకరంగా గడిచి ఉంటాయో ఒక్కసారి ఊహించండి. గుండెలు బద్దలయ్యేలా ఆమె భర్త భాస్కర్ రోదనలు ఇప్పటికీ ఆ రోజు గుర్తు చేసుకుంటే కన్నీళ్లు ఆగవు. "రూ.2 కోట్లు ఇచ్చారు, కానీ నా బిడ్డ బతుకు కోసం అది చాలదు" అంటున్నాడు ఆ తండ్రి. శ్రీతేజ్ మెదడు 70 శాతం దెబ్బతిని ఉంది. ఇప్పటివరకూ కేవలం 5 శాతం మాత్రమే శ్రీతేజ్ కోలుకున్నాడు. శ్వాస తీసుకోవడానికి, ఆహారం తీసుకోవడానికి పైపులే ఆధారం.ప్రతిరోజూ న్యూరో- రిహాబిలిటేషన్ చికిత్స పొందుతూ ఉన్నాడు. ఆకలి అని సైగ చేయలేని బిడ్డ, తల్లి పిలుపు లేని స్థితి ఆబిడ్డది. ఇది రకంగా ఏ విజయం? 'పుష్ప 2' బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొట్టింది. అల్లు అర్జున్ కెరీర్ టాప్‌లో ఉంది. కానీ ఆ విజయం వెనుక ఒక తల్లి రక్తం, ఒక బిడ్డ కన్నీళ్లు మరచిపోయామా? రేవతి కుటుంబం ఇప్పటికీ ఆర్థికంగా, మానసికంగా కుదేలైపోతోంది. శ్రీతేజ్ భవిష్యత్తు అంధకారంలో మునిగిపోయింది. ఆ చిన్నారి "పుష్ప ఫైర్" అని తనను తాను పిలుచుకునేవాడట. ఇప్పుడు ఆ ఫైర్ ఆరిపోయింది. తల్లి లేని ఖాళీ ఇల్లు, బతుకు పోరాటంలో ఉన్న బిడ్డ ఆసుపత్రిలో. ఇది మన సమాజం యొక్క నిజమైన చిత్రం. అభిమానం ఆమోగ్యమైనదే కానీ అది ఆవేశంగా మారి ప్రాణాలు తీస్తే? స్టార్‌డమ్ బాధ్యతలు మరచిపోతే? థియేటర్లు లాభం కోసం నిబంధనలు ఉల్లంఘిస్తే? ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే? ఇలాంటి విషాదం మళ్లీ పునరావ ృతం కాకుండా ఏం చేయాలి? రేవతి మరణం మనకు ఒక గుణపాఠం కావాలి. వినోదం ప్రాణాల కంటే ముఖ్యమా? ఒక తల్లి ప్రాణం మరీ ఇంత చవకనా? రేవతి ఆత్మకు శాంతి చేకూరాలి. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలి. ఆ కుటుంబం మళ్లీ చిరునవ్వు చూడాలి. మనమంతా ఈ బాధను గుర్తుంచుకుని, మరింత మానవత్వంతో మారాలి. అప్పుడే రేవతి త్యాగం వ ృథా కాదు. అప్పుడే నిజమైన విజయం సాధ్యం. రేవతి... నీవు లేని ఈ ఏడాది మా గుండెల్లో శాశ్వత గాయం. ఇది పుష్ప సినిమా విజయానికి విషాద ముగింపే.

## హైకోర్టుకు క్షమాపణ

మొదటి పేజీ తరువాయి...

బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకాలేకపోతున్నానని.. మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమి భట్టాచార్య, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావులతో కూడిన ధర్మాసనం నవంబర్ 27న విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదనలు వినిపిస్తూ తప్పనిసరి అధికారిక విధులతోపాటు, తన హాజరుతో కోర్టును ఇబ్బంది పెట్టరాదన్న కారణంగా మినహాయింపు కోరుతున్నారనగా ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ ఆయన కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు తెలియజేస్తున్నామని వ్యాఖ్యానించింది. కోర్టు తలచుకుంటే ధిక్కరణను ఎదుర్కొంటున్న కమిషనర్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టులో నిలబెట్టగలదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. హాజరు మినహాయింపునకు నిరాకరిస్తూ కమిషనర్ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది. ఈక్రమంలో శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా హైకోర్టు ఎదుట హాజరై క్షమాపణలు చెప్పారు.



మైలార్ దేవుపల్లి బస్తీలో అయ్యప్ప స్వామి ని దర్శించుకున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్దేవుపల్లి బస్తీలో యాదగిరి గురుస్వామి ఆధ్వర్యంలో గణేశ్ గురుస్వామి అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి. చిత్రంలో పి. సం తుగౌడ్ స్వామి, రావుల భాస్కర్, జి.పాండు తదితరులు. ఈ సందర్బంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతు, భక్తులు శాంతియుత వాతావరణంలో అయ్యప్ప పూజలు, భజనలు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావంతో ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుం దన్నారు.**

**- బుద్వేల్, నమస్తే ఉదయం**

## హైదరాబాద్ తరహాలో వరంగల్ అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి...

నర్సంపేటలో పర్యటించారు. రూ.532 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నర్సంపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. వరంగల్ గడ్డకు చెందిన ఎందరో వీరులు తమ పరాక్రమాన్ని ప్రపంచానికి చూపారు. కాకతీయ యూనివర్సిటీ పోరాటాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయి. తెలంగాణ వస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ జిల్లా ప్రజలు ఆశించారు. కుర్చీలో కూర్చున్న వారి ఆస్తులు పెరిగాయి కానీ, ప్రజల జీవితాలు మారలేదు. మీ ఓటునే ఆయుధంగా మార్చి.. గడీల పాలనను కూల్చారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతోంది. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్టే అని ఆనాటి సీఎం కేసీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వం మాత్రం.. రైతు పండించిన చివరి గింజ వరకు కొంటోంది. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని ఆనాటి సీఎం దుష్ప్రచారం చేశారు. రైతు బంధు బంద్ అవుతుందని ప్రజలను బెదిరించారు. కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చాక.. రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమ్ కట్ అయ్యింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు ఉన్నది కాంగ్రెస్‌కు మాత్రమే. గత సీజన్‌లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద ఇచ్చాం. ఈ దేశంలో వరి అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా.. 3.10 కోట్ల మంది లబ్దిదారులకు సన్నబియ్యం ఇస్తున్నాం. రేషన్ కార్డుల్లో కొత్తవారికి చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాం. సన్నబియ్యం ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నాం అని సీఎం అన్నారు. రేవంత్ తో సహా వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. వరంగల్ ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు సీఎం రేవంత్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సంపేటపై వరాల జల్లు కురిపించారు సీఎం రేవంత్. రూ.532.24 కోట్లతో నర్సంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ÷ఔ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.÷ఔ.82.56 కోట్లతో హన్మకొండ-నర్సంపేట-మహబూబాబాద్ రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ÷ఔ.17.28 కోట్లతో నర్సంపేట- పాఖాల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 56.40 కోట్లతో నర్సంపేట నుంచి నెక్కొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 20 కోట్లతో నర్సంపేట పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వైఎస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదవాళ్లకు ఇచ్చారు.. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చి పేదల్ని మోసం చేశారు.. పేదల ఆత్మ గౌరవం పెంచేందుకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం.. 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ కు ఏమేమి ఉన్నాయో వరంగల్ కు కూడా అవే తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మార్చి 31 లోపల వరంగల్ లో ఎయిర్ పోర్టును ప్రారంభించుకుంటామన్నారు. వరంగల్ లో అండర్ డ్రైనేజ్, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించుకుంటాం.. సౌర విద్యుత్ ని ఉత్పత్తి చేసే బాధ్యతను మహిళలకు అప్పగించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## అర్బన్ ఏరియాల్లో బహుళ అంతస్థుల నివాసాలు

మొదటి పేజీ తరువాయి...

ఇళ్ల కోసం కూడా ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మించి పేదలకు ఇచ్చే ప్రణాళికలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో అర్బన్ ప్రణాళిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఓ ఆర్ ఆర్‌కు ఆనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో చోట 10వేల ఇళ్లు నిర్మించి నో ప్రాఫిట్, నో లాస్ కింద మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రణాళికలు ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గగత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖను తిరిగి తాము బలోపేతం చేశామని వివరించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని తాము ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు. రూరల్‌లో, అర్బన్‌లో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు కూడా త్వరలో శుభవార్త చెబుతామని పేర్కొన్నారు. ఒక విడతలోనే ఇళ్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని చెప్పుకొచ్చారు. హిల్ట్‌పాలసీ పై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. హిల్ట్ పాలసీపై కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని అంటున్నారని... నోటికొచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని.. వారి హయాంలో ఇష్టం వచ్చినట్లుగా చేశారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం చాలా వినూత్న నిర్ణయాలు తీసుకుంటుందని.. కేసీఆర్ హయాంలో లాగా తాము చేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

మొదటి పేజీ తరువాయి...

విడుదల చేసింది.డిసెంబరు 23వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో డిసెంబరు 29, 30వ తేదీల నుంచి జనవరి 8వ తేదీ వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలను నిలిపివేసింది. అలాగే జనవరి 25వ తేదీన రథసప్తమి దృష్ట్యా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖల స్వీకరణ రద్దు చేసినట్లు టీటీడీ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని సూచించింది.

## ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు

మొదటి పేజీ తరువాయి...

లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా ఈ విచారణలో భాగంగా అధికారులు సిఫార్సులు చేయనున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులపై పౌరవిమానయాన శాఖ నిరంతరం సమీక్ష జరుపుతోంది. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్లు అందించేలా 24/7 అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విమానయాన సంస్థలతో సమన్వయం, ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో దీనిని అందుబాటులోకి తెచ్చారు. కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాల్సిన నంబర్లు 011-24610843, 011-24693963, 096503-91859 అని తెలిపింది. ఈ క్రమంలో ఇండిగో సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర్ణయించినట్టు తెలిపింది.

## అమెరికా ఆంక్షలు ఉన్నా చమురు రవాణా ఆగదు

మొదటి పేజీ తరువాయి...

భారత్- రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని రష్యా అధ్యక్షుడు అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకారాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్- యురేషియా ఆర్థిక సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులు తున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు.మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్- రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కో లోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు. భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.

## రాజేంద్రనగర్‌లో ప్రపంచ నేలల దినోత్సవం




బుద్వేల్, డిసెంబరు 5 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్‌ఆర్) లో శుక్రవారం ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. భూ సారాన్ని కా పాడుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. చెన్నై కు చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులకు భూ సార పరీక్షల పై అవగాహన కల్పించారు. అనంతరం వారం దరికి భూ సార పరీక్షల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఐఆర్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, సాయిల్ సైన్స్ విభాగం హెడ్ డాక్టర్ ఎంబీబీ ప్రసాద్ బాబు, డాక్టర్ గోబినాథ్, డాక్టర్ నిగమ్, డాక్టర్ లత, డాక్టర్ మానస, టెక్నీకల్ ఆఫీసర్ మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌ఐపీహెచ్‌ఎం ఆధ్వర్యంలో..**

రాజేంద్రనగర్ లోని నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజిమెంట్ (ఎన్‌ఐపీహెచ్‌ఎం) ఆధ్వర్యంలో ఆ సం స్థ శాస్త్రవేత్తలు బుద్వేల్ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు నేల ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ తో పాటు డాక్టర్ దామోదర చారి లు విద్యార్థులకు భూ సారం గురించి, నేల ఆరోగ్యం గురించి అవగాహన కల్పిం చారు. నేల ను ఆరోగ్య వంతంగా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు...



విద్యార్థులకు నేలల ఆరోగ్యం గురించి వివరిస్తున్న ఎన్ ఐ సి హెచ్ ఎం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్

## పోలీసులకు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిభిరాన్ని ప్రారంభిస్తున్న కమాండెంట్ రామకృష్ణ.



వైద్యశిభిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కమాండెంట్.

### కమాండెంట్ రామకృష్ణ

శేరిలింగంపల్లి : డిశంబర్ 5, (నమస్తే ఉదయం)స్పెషల్ పోలీసులకు విధి నిర్వహణ తోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణ సూచించారు. కొండాపూర్ 8వ బెటాలియన్ లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మెడికవర్ హాస్పిటల్ సహకారంతో ఉద్యోగుల కోసం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, జనరల్ ఫిజీషియన్ తోపాటు గైనకాలజిస్ట్ వంటి వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని సుమారు 200 మంది సిబ్బందికి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కమాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం తోపాటు శారీరక మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమని చెప్పారు. సిబ్బంది సంక్షేమాన్ని ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి ఉద్యోగి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోరారు. మంచి ఆహారపు అలవాట్లు అలపర్చుకోవాలని శారీరక వ్యాయామం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్ కమాండెంట్స్ ఎం. నాగభూషణం కేవి రవిచంద్ర రహిమాన్ ఎస్. రాంబాబు పార్థసారథి రెడ్డి ఉన్నతాధికారులు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అద్భుతమైన శక్తికి.. సృజనాత్మకతకు..

# దృఢ సంకల్పానికి ప్రతీక దివ్యాంగులు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



కలెక్టర్ ను సన్మానిస్తున్న దివ్యాంగులు

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 05(నమస్తే ఉదయం): శారీరకంగా వికలాంగులైనా, మానసికంగా, సామర్థ్యపరంగా సకలాంగులతో సమానమే అని దివ్యాంగులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక జూబ్లీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిధి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సృజనాత్మకత, సంకల్పంతో దివ్యాంగులు అన్ని రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుతున్నారన్నారు. జిల్లా లో ఉన్న దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి పెడుతున్నా రన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో.. రేడియాలజీ హబ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని.. అందులో అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్న రన్నారు. అదే విధంగా సదరం సర్టిఫికెట్లు ఆపిల్ సిస్టం ను కూడా యు డి ఐ డి లో పొందుపరిచారని తెలియజేశారు. మహిళా దివ్యాంగుల సంఘాలు కూడా ఏర్పాటు అయ్యాయని అందులో సభ్యులు గా నమోదు కావాలన్నారు. జిల్లా యంత్రాంగం మొత్తం అన్ని విధాలుగా తోడుగా ఉంటుందన్నారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రోత్సాహం, సర్టిఫికేట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిడబ్ల్యూఓ కోదండరాములు, దివ్యాంగుల జిల్లా కమిటీ సభ్యులు పాముకుట్ల చందు, పంతులు ప్రభాకర్, మేకల సమ్మయ్య, బోట్ల సుమతి, మట్టి కిషన్, తాళ్లపల్లి కుమార్, రావుల సత్యనారాయణ, దివ్యాంగుల సంక్షేమ సంఘ నాయకులు, దామెర రమేష్, వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి సయ్యద్ మున్నావర్, సి డి పి వో సత్యవతి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకూడదు

### కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి

పటాన్ చెరు, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం): విద్యార్థి దశ నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బొల్లారం బిజెపి పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం ఎన్ వి ఆర్ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా మాదకద్రవ్యాలు, వాటి ద్వారా వచ్చే ఫలితం గురించి ఆయన సందేశాన్ని ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పగలనక, రాత్రనక ఎంతో కష్టపడుతూ, అప్పులు చేసి చదివిస్తున్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలని కోరారు. ముఖ్యంగా 12 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సున్న విద్యార్థులు మత్తుపదార్థాలు (మద్యం), డ్రగ్స్ వంటి ప్రమాదకరమైన దురలవాట్లకు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని , అలాంటి వ్యసనాల జోలికి పోవద్దని అన్నారు. చదువుకోవాల్సిన సమయంలో, ప్రేమ పేరుతో పక్కదారి పట్టి, తమ చదువును, బంగారు భవిష్యత్తును పణంగా పెట్టకూడదని, తొందరపాటు నిర్ణయాలు వారి జీవితాలనే కాక, తల్లిదండ్రుల కలలను కూడా చిద్రం చేస్తాయని అన్నారు. విద్యార్థులు సక్రమం మార్గంలో నడిచే విధంగా ఉపాధ్యాయులు అవసరమైతే కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.



## ఆరోగ్య శాఖామంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

పటాన్ చెరు,డిసెంబర్ 5 (నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి పుట్టిన రోజు సందర్భంగా దామోదర రాజనర్సింహా ను పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వి. చంద్రారెడ్డి, మరియు పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.




## పరిశ్రమల్లో విపత్తు సన్నద్ధత శిక్షణ తప్పనిసరి:

### హైగ్రో పరిశ్రమలో మాక్ డ్రిల్ నిర్వహించిన పటాన్ చెరు అగ్ని మాపక అధికారి కెవి నాగేంద్ర

పటాన్ చెరు, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం): ప్రమాదాలు సంభవించినపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కార్మికులకు తెలిసే విధంగా శుక్రవారం బొల్లారంలోని హైగ్రో పరిశ్రమలో పటాన్ చెరు అగ్ని మాపక అధికారి కెవి నాగేంద్ర ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు ఎలా స్పందించాలి, అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ హైగ్రో పరిశ్రమ కార్మికుల భాగస్వామ్యంతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే వాటిని అదుపు చేయడానికి ఎలా వ్యవహరించాలో ఆయన వివరించారు. ప్రమాదాల నియంత్రణకు ప్రతి పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హైగ్రో పరిశ్రమ కార్పోరేట్ హెచ్ ఆర్ నచికేత దేవర, పరిశ్రమ ప్రధాన నిర్వాహకుడు, పరిశ్రమ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష మాదిగతో రాజేంద్రనగర్ సర్కిల్ దళిత నాయకులు

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతికి మంద క్రిష్ణ మాదిగకు ఆహ్వానం

బుద్వేల్, డిసెంబరు 5 (నమస్తే ఉదయం) మైలార్దేవుపల్లి డివిజన్ బాబుల్ రెడ్డినగర్ లో ఉన్నటువంటి బీసీ ఎస్సీ ఎస్టీ చైతన్య వేధిక కార్యాలయం ఆవరణలో శనివారం జరుగనున్న భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమానికి రావాలని కోరుతు శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ కు బీసీ ఎస్సీ ఎస్టీ చైతన్య వేదిక నాయకులు ఆహ్వానం అందజేశారు. బీసీ ఎస్సీ ఎస్టీ చైతన్య వేధిక అధ్యక్షుడు కె హరినాథ్ మాట్లాడుతూ, శనివారం ఉదయం 10 గంటలకు జరిగే అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమానికి మంద క్రిష్ణ మాదిగను ఆహ్వానించడం జరిగిందన్నారు. క్రిష్ణ మాదిగ ను కలసిని వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వనం నర్సింహ్మ మాదిగ, గోల్కొండ రాజ్ కుమార్. ఎడ్లకాడి సూర్యం లు ఉన్నారు.



సర్పంచ్ అభ్యర్థి రాజేష్ అయ్యా

## చిన్న చింతరేవుల గ్రామంలో పోటాపోటీగా ఎన్నికల ప్రచారాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్5(నమస్తే ఉదయం)ఒక్క సారి గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇవ్వాలని ఒకరు... గతంలో చేసిన అభివృద్ధి చూసి మరోసారి ఓటు వేసి గెలిపించాలని మరొక్కరు జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం చిన్న చింతరేవుల గ్రామ సర్పంచ్ అభ్యర్థులు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మొదటి విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం చిన్న చింతరేవుల గ్రామంలో కత్తెర గుర్తు అభ్యర్థిగా రాజేష్ అయ్యా, ఉంగరం గుర్తు అభ్యర్థి ప్రభాకర్ గౌడ్ తమ ప్రచారాలను నిర్వహిస్తు ఓటర్లను ఆకర్షిస్తున్నారు. ఈ సందర్భంగా కత్తెర గుర్తు అభ్యర్థి రాజేష్ అయ్యా మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ ఎంపీడీకే అరుణ ఆశీస్సులతో చింతరేవుల గ్రామ సర్పంచ్ అభ్యర్థి పోటీలో ఉన్నానని, తనకు సర్పంచ్ గా అవకాశం ఇస్తే గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, గ్రామానికి సేవ చేస్తూ రుణాన్ని తీర్చుకుంటానని, కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గతంలో గ్రామ సర్పంచ్ గా శిల్ప ప్రభాకర్ గౌడ్ ఉన్నప్పుడు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని ప్రస్తుత సర్పంచ్ అభ్యర్థి ప్రభాకర్ గౌడ్ తెలిపారు. గ్రామంలో గతంలో సీసీ రోడ్డు నిర్మాణాలు, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లుణ, తాగునీటి కొరత కష్టాలనుండి ప్రభుత్వ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు, అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేసి గ్రామాని అభివృద్ధిలో నడిపించడం జరిగిందని, మరోసారి ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి ప్రభాకర్ గౌడ్ తెలిపారు.



## వామన్ పల్లి గ్రామంలో త్రిముఖ పోటీ

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 5(నమస్తే ఉదయం) ధరూర్ మండలం వామన్ పల్లి గ్రామంలో త్రిముఖ పోటీ నెలకొన్నది. వామన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వామన్ పల్లి, జీరబండ, నర్సన్ దొడ్డి గ్రామాలు ఉండగా వామన్ పల్లి గ్రామ పంచాయతీలో సుమారు 1,113 ఓటర్లు ఉన్నారు. వామన్ పల్లిలో 530, జీరబండలో 123, నర్సన్ దొడ్డిలో 460 ఓటర్లు ఉన్నట్లు సమాచారం. వామన్ పల్లి గ్రామం నుంచి సర్పంష్ంచ్ అభ్యర్థిగా బోయ రాములు పోటీ చేయగా కత్తెర గుర్తు కేటాయించారు. అదే గ్రామం నుంచి సర్పంచ్ అభ్యర్థిగా రంగస్వామి పోటీ చేయగా బ్యాట్ గుర్తు కేటాయించారు. నర్సన్ దొడ్డి గ్రామం నుంచి వామన్ పల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పర్నికరెడ్డి పోటీ చేయగా ఉంగరం గుర్తు కేటాయించారు. ఈ నెల 11న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వామాన్ పల్లి గ్రామంలో పోటీలో ఉన్న అభ్యర్థులు ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు. ఉదయం, సాయంత్రం ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామానికి చేయబోయే అభివృద్ధి పనులను ఓటర్లకు వివరిస్తూ ప్రచారాలను కొనసాగిస్తున్నారు. కేవలం ఐదు రోజులే ప్రచారానికి గడువు ఉండటంతో ప్రతి ఓటరును పలుమార్లు కలిసి తమకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

## నందిన్నె వద్ద మద్యం పట్టివేత

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్5(నమస్తే ఉదయం)గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉండగా అక్రమంగా మద్యాన్ని తరలించేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న మరో వ్యక్తి పై శుక్రవారం కేటిదొడ్డి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం..కేటిదొడ్డి మండల పరిధిలోని నందిన్నె వద్ద కొండాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యాన్ని తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు తనిఖీ చేయగా వారి నుంచి 33.480 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. అదే విధంగా మల్లాపురం తండాలో కేతావత్ మల్లేష్ నాయక్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా 17.400 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.




సిపిఐ అభ్యర్తిగా నామినేషన్ వేస్తున్న జీడీ ఎల్లయ్య

## కడవెండి సిపిఐ, మిత్రపక్షాల సర్పంచ్ అభ్యర్తిగా జీడీ ఎల్లయ్య నామినేషన్ దాఖలు

### నామినేషన్ పక్రియలో పాల్గొన్న పెద్ది కృష్ణ మూర్తి

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 05(నమస్తే ఉదయం): జిల్లా లోని దేవరుప్పుల మండలం,కడవెండి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ, మిత్రపక్షాల మద్దతుతో జీడి ఎల్లయ్య, పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నామినేషన్ కేంద్రం సీతారాంపురం గ్రామంలో తన నామినేషన్ దాఖలు చెసారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ కడవెండి గ్రామ శాఖ అధ్యక్షుడు చెన్నూరి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసంపెల్లి మహేందర్, మైనాల మల్లాజీ, కౌడగాని సోమనర్సయ్య, రంగు శీను, కాశగాని యాదగిరి, పెద్ది శ్రీను, పెద్ది రమేష్, గంగరబోయిన మల్లయ్య, సుడిగాల నరేష్, పైండ్ల యాదగిరి, సుడిగెల ఐలయ్య, సిపిఐ నాయకులు బెజగం ఎల్లయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మాదిగ ఉన్నతాధికారులు, టాసా ఉపాధ్యక్షులను సన్మానించిన మాదిగ సంఘాల నాయకులు

బుద్వేల్ , డిసెంబరు 5 (నమస్తే ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ పీజీ స్టడీస్ గా ఉన్న డాక్టర్ కే బీ ఈశ్వరి, తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ జె కమలాకర్ లను శుక్రవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, వివిధ పార్టీలలో ఉన్న మాదిగలు కలసి సన్మానించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మాదిగ విద్యార్థులకు, ఉద్యోగులకు, అధ్యాపకులకు, కార్మికులకు ఉన్నతాధికారులు అండగా నిలవాలని కోరారు. అదే సమయంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, వివిధ పార్టీల లో ఉన్న మాదిగ నాయకులు వ్యవసాయ విశ్వవిద్యాలయం లో పని చేస్తున్న మాదిగ సామాజిక వర్గాల వారికి అండగా ఉంటారన్నారు. కే బీ ఈశ్వరి, డాక్టర్ జే కమలాకర్ ను సన్మానించిన వారిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు వనం నరసింహ మాదిగ, క్యాసారం శంకర్ రావు మాదిగ, ననాగారి రామచందర్ మాదిగ, బీసీ ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక చైర్మన్ కె. హరినాథ్, కాంగ్రెస్ మైలార్ దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు నత్తి ధనుంజయ, సీనియర్ నాయకులు పలుగు చెరువు మహేష్, పి జీవన్ దాస్, అనుముల జాన్ పాల్, గోల్కొండ యాదయ్య, నవ జ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడు మంగలారం శ్రీనివాస్, బీ ఆర్ ఎస్ నాయకులు ఎడ్ల కాడి సూర్యం, వీర్లపల్లి నవీన్ కుమార్, జర్నలిస్టు సంఘాల నాయకులు అప్పారెడ్డి గూడెం భీమయ్య, పి. వెంకటేష్, ఎం బాలసుబ్రమణ్యం, ఆరింట్ల విశాల్, సురేష్, రాధాకృష్ణ, వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎం రాజు లు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ కే బి ఈశ్వరి ని సన్మానిస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, వివిధ పార్టీల లలో ఉన్న మాదిగలు యువకులు,



టాసా ఉపాధ్యక్షుడు డాక్టర్ జె కమలాకర్ ను సన్మానిస్తున్న మాదిగ సంఘాల నాయకులు

# నిస్సార నేలల్లో.... సూక్ష్మజీవుల ప్రాముఖ్యత

సృష్టికి మూలాధారం నేల ఈ నేలతల్లి మానవునికి వరం లాంటిది మానవ మనుగడ మరియు జీవనాధారం మట్టితోనే మొదలవుతుంది మట్టితోనే ముగుస్తుంది కాబట్టి నేలని సంరక్షించి సంపదను సృష్టించడానికి ,ప్రతి మొక్కకి జీవం మట్టే ప్రతి ప్రాణికి మట్టే ఆధారం,ఆహారం మొదలయ్యేది నేల నుండి, మట్టిని కాపాడుకుందాం భవిష్యత్తుని కాపాడుకుందాం, బంజరు భూమి నుండి బంగారాన్ని సృష్టిద్దాం, నేల నీరే జీవనాదారం, నేలను జాగ్రత్తగా చూసుకోవడం కొలవడం పర్యవేక్షించడం నిర్వహించడం అనే నినాదాలతో మట్టి యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేయడానికి, నేల సారాన్ని ఆరోగ్యాన్ని కాపాడడానికి ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ ఏటా డిసెంబర్ ఐదున అంతర్జాతీయ మృతిక దినోత్సవం నిర్వహిస్తుంది.

ఆరోగ్యకరమైన నగరాలకు ఆరోగ్యకరమైన నేలలు ఈ ఏడాది ఉత్సవ నినాదం.

ఉత్సవాలు ఊరూరా జరుగుతున్నా నేలను రక్షించడంలో ప్రభుత్వాల పని తీరు అంతంత మాత్రమే. పైపొర మట్టిలో సేంద్రీయ పదార్థాలు మరియు సూక్ష్మజీవులు ఉంటాయి ఈ పైపొరలో రెండు నుండి మూడు సెంటీమీటర్ల మట్టి ఏర్పడటానికి వెయ్యి సంవత్సరాల సమయం పడుతుంది , సకల జీవరాసులకూ మట్టే ఆధారం అటువంటి మట్టి సారం కోల్పోవడం ఆందోళనకు

గురి చేసే విషయం నేలలో అధిక మోతాదులో రసాయన ఎరువులు వేయడం వలన నేల నిస్సారానికి గురవుతుంది.

ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ఇప్పటివరకు ఎనభై మూడు శాతం నేల సారాన్ని కోల్పోయిందని ఇంకో నలభై సంవత్సరాల తర్వాత భూమి మీదనున్న ప్రతి జీవరాసి ఆహార సమస్యలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోక తప్పదని తేల్చి చెప్పింది వరల్డ్ ఎకనామిక్ ఫోరం లెక్కల ప్రకారం తీవ్రమైన ఆహార కొరత ఏర్పడి బీదలు ధనికులు అందరూ తీవ్రమైన కరువుకు గురి కావాల్సిందే అని చెప్పడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా భూమి ఉపరితలంపై పన్నెండు అంగుళాల వరకు ఉండే సూక్ష్మజీవులు ఎనభై మూడు శాతం కోల్పోవడం ఇందుకు ప్రధానమైన కారణం అధిక మోతాదులో పెస్టిసైడ్స్ వేయడం వలన నేలలో సహజంగా ఉండి నేల సారాన్ని మరియు సేంద్రీయ పదార్థాన్ని పెంచే సూక్ష్మజీవులు అంతరించిపోతున్నాయి మానవ శరీరంలో మేలు కర సూక్ష్మజీవుల పాత్ర ఎంత క్రియాశీలమో మట్టిలో మొక్కలో కూడా ఈ సూక్ష్మజీవులకు అంత ప్రాముఖ్యత ద ఉంది.

పంట కోసిన అనంతరం రైతన్నలు కొయ్యలను భూమిలోనే తగలబెట్టడం మన తెలుగు రాష్ట్రాల్లోనే కాక అన్ని రాష్ట్రాల్లో వరి కొయ్యలను మిగిలిన గడ్డిని తగలబెట్టడం జరుగుతుంది ఇలా తగలబెట్టడం వలన నేల కాలుష్యానికి గురై ముఖ్యంగా నేలలో ఉండే మేలుకర సూక్ష్మజీవులు జీవరాసులు నశిస్తున్నాయి నేలపోరలు దెబ్బతింటున్నాయి పంజాబ్ మరియు హర్యానాలో రైతులు ఎక్కువ శాతం వరి కొయ్యలను తగలబెట్టడం వలన దాదాపు ఎనభై నుండి ఎనభై ఐదు శాతం నేల సారాన్ని కోల్పోయింది అంతేకాకుండా రైతులు ఈ పద్ధతి పాటించడం ద్వారా ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడానికి ఒక ప్రధాన కారణంగా మారుతుంది ఇలా చేయడం వలన భూమిలో మూడు శాతంగా ఉండవలసిన సేంద్రియ పదార్థం క్రమక్రమంగా తగ్గుతూ జీరో పాయింట్ ఐదు శాతానికి పడిపోయింది మొక్క ఎదుగుదలకు దోహదపడే జింకు పొటాషియం మ్యాంగనీస్ ఐరన్ కాపర్ వంటి పోషకాల లభ్యత తగ్గిపోతుంది.

అధిక మోతాదులో ఎరువులను నేలలో వేయడం వలన మొక్కకు అందని స్థితిలో ఉంటున్నాయి ఈ ప్రక్రియలో లభ్యం కాని స్థితిలో ఉన్న స్థూల మరియు సూక్ష్మ పోషకాలను లభ్యస్త స్థితిలోనికి తీసుకురావడంలో,నేల సారాన్ని ,సేంద్రియ పదార్థాన్ని పెంచడంలో సూక్ష్మజీవుల పనితీరు అమోఘమైనది. ప్రపంచవ్యాప్తంగా నిస్సారంగ మారిన నేలలు సారవంతంగా మారాలంటే సూక్ష్మజీవుల జనాభాను నేలలో పెంచాలి క్షేత్రస్థాయిలో బయో ఫెర్టిలైజర్స్ పై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రీసెర్చ్ స్టేషన్ల లో కృషి విజ్ఞాన కేంద్రాలలో బయోఫెర్టిలైజర్స్ ల్యాబ్స్ ని స్థాపించి గ్రామ స్థాయిలో జీవన ఎరువులను రైతులకు అందించినట్లయితే నేల ఆరోగ్యాన్ని మరియు ప్రతి గ్రామాన్ని పట్టణాన్ని ఆరోగ్యంగా పచ్చదనంగా ఉంచవచ్చు కలుషితం లేని ఆహారాన్ని ఉత్పాదన చేయవచ్చు.

నేల సారాన్ని మరియు ఆరోగ్యాన్ని పెంచే ముఖ్యమైన సూక్ష్మజీవులు రైజోబియం, అజటోబాక్టర్, సుడోమోనాస్, ,అజోల్లా, ఆజోస్పిరిల్లం,భస్వరాన్ని జింకు ను కరిగించే సూక్ష్మ జీవులు మొదలైనవి. ప్రపంచవ్యాప్తంగా చెట్లను నరికి వేయడంతో పర్యావరణ మార్పుల వలన మరియు ఉష్ణోగ్రతల మార్పుల వలన వ్యవసాయం అనేక సమస్యలకు గురి అవుతుంది. అధిక దిగుబడి సమస్య నీటి సమస్య నేల



ఆరోగ్య సమస్య మొదలగు సమస్యలు క్రమ క్రమంగా రోజురోజు అధికమవుతున్నాయి, ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన గ్లోబల్ ఫారెస్ట్ రిసోర్స్ అసెస్మెంట్ రెండువేల ఇరువదైదు సంవత్సర నివేదిక ప్రకారం మొత్తం అటవీ విస్తీర్ణంలో భారతదేశం పదవ స్థానం నుండి తొమ్మిదవ స్థానానికి చేరుకుందని చెప్పడం హర్షించదగ్గ విషయం.

వార్షిక నికర అటవీ విస్తీర్ణంలో పెరుగుదలలో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా మూడవ స్థానాల్లో కొనసాగుతుంది ప్రణాళిక బద్ధంగా ఇలాగే అటవి విస్తీర్ణంలో మరియు అటవీ సంరక్షణలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అడవి నరికివేతను తగ్గించినట్లయితే పర్యావరణాన్ని భూమిని కాపాడుకోవచ్చు నెలలో ఉండే సూక్ష్మజీవుల జనాభాను సహజంగా కాపాడుకొని నేల సారాన్ని పెంచుకోవచ్చు.

రైతులు ఎదుర్కొంటున్న మరొక ప్రధానమైన సమస్య నేల కోతకు గురి కావడం అధిక వర్షపు నీరు వలన మానవ కార్యకలాపాల వలన నేలకోతకు గురై నేలపొరలో ఉండే సారం మరియు మేలుకర సూక్ష్మజీవులను కోల్పోయి భూమి క్షీణతకు గురవుతుంది

ఈ సమస్య నుండి రైతులకు ఉపశమనం కలగాలంటే భారతదేశం ప్రజాస్వామ్య దేశం కాబట్టి ప్రజలందరూ చైతన్యవంతులై ప్రతి ఒక్కరు యుద్ధ ప్రాతిపదికన అధిక మొత్తంలో చెట్లను నాటడంతోపాటు రైతన్నలు అపరాల పంటలు వేసుకున్నచో నేల కోతను అరికట్టవచ్చు పర్యావరణాన్ని కాపాడి నేలను ప్రతి గ్రామాన్ని పట్టణాన్ని ఆరోగ్యంగా ఉంచవచ్చు.

భారత ప్రభుత్వం సాయిల్ హెల్త్ కార్డు స్కీమ్ రెండువేల పదిహేను సంవత్సరంలో తీసుకురావడం జరిగింది. స్కీమ్ యొక్క ముఖ్య ఉద్దేశం నేలలో ఏ పంట వేసుకోవచ్చు, భూమి యొక్క పోషక స్థితిని తెలియజేయడం,రైతు పొలంలో మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్లో పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డ్స్ జారీ చేయడం ద్వారా ప్రతి రైతు భూమి యొక్క ఆరోగ్య స్థితిని తెలుసుకోవచ్చు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు జీవనఎరువులపై మరియు మట్టి పరీక్షలపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులను చైతన్యపరుస్తూ క్షేత్ర స్థాయిలో రైతులకు వ్యవసాయంలో శాస్త్రీయపరమైన మెళుకువలు అందించడంలో తమదైన భూమిక పాత్రను పోషిస్తున్న శాస్త్రవేత్తలను అభినందించాల్సిన విషయం కానీ సుసంపన్నంగా ఉండాల్సిన నేల సారాన్ని కోల్పోయి వాతావరణ మార్పుల వలన అనేక సమస్యలు ఎదుర్కోవడం వలన నేల క్షీణతకు గురై అధిక దిగుబడి అధిక ఆదాయం రాక రైతు బతుకు ఎండుతుంది కానీ పండడం లేదు.

ఈ సమస్యను అధిగమించాలంటే రీసెర్చ్ స్టేషన్ల లో, కృషి విజ్ఞాన కేంద్రాలలో ,ఏరువాక కేంద్రాలలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు బయోఫెర్టిలైజర్స్ ల్యాబ్స్ ని స్థాపించి గ్రామస్థాయిలో జీవన ఎరువులను రైతులకు అందించినట్లయితే మెరుగైన ఫలితాలను చూడవచ్చు

**నేలలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు**

దుక్కిదున్నడం.
జీవన ఎరువులు వేయడం.
నీటి యాజమాన్యం.
సమగ్ర నేల ఆరోగ్య నిర్వహణ పద్ధతులు.
సమగ్ర భూసార సంరక్షణ.
నేల ఆరోగ్యం కాపాడే సేంద్రియ పదార్థం వేయడం.
నీటితో పాటు పోషకాలను అందించడం మొదలైనవి.

**ముఖ్యమైన నేల యాజమాన్య పద్ధతులు:**

నేల తయారీ:

కల్టివేటర్ లేదా నాగలితో ఒకటి లేదా రెండుసార్లు లోతుగా దున్నుకోవాలి.

ఇలా చేయడం వల్ల నేల గాలి ఆడేలా మారుతుంది మరియు కలుపు మొక్కలు నియంత్రించబడతాయి.

సేంద్రీయ ఎరువులు:

పంటకు అవసరమైన పోషకాలను అందించడానికి సేంద్రీయ ఎరువులు లేదా కంపోస్ట్ వాడాలి.

ఇది నేల నిర్మాణాన్ని మెరుగుపరుస్తుంది మరియు సూక్ష్మజీవుల కార్యకలాపాలను పెంచుతుంది.

నీటి యాజమాన్యం:

నేల తేమను నిలుపుకునే విధంగా తగిన మోతాదులో నీటిని అందించాలి.

సమర్థవంతమైన నీటిపారుదల పద్ధతులను అనుసరించడం వల్ల నీటి వృధాను అరికట్టవచ్చు.

పంటల మార్పిడి:

ఒకే రకమైన పంటను పదేపదే వేయకుండా, పంటల మార్పిడిని పాటించాలి.

దీనివల్ల నేల సారాన్ని కాపాడుకోవచ్చు మరియు తెగుళ్ళను నివారించవచ్చు.

**మొక్కల పెంపకం:**

మొక్కలు నేలను తాకకుండా కర్రల సహాయంతో ఆధారం ఇవ్వాలి. ఇది మొక్కలు ఏపుగా పెరగడానికి, తెగుళ్ళను తగ్గించడానికి మరియు దిగుబడిని పెంచడానికి సహాయపడుతుంది.

తెగుళ్ళు మరియు చీడపీడల నివారణ:

తెగుళ్ళు, చీడపీడల నివారణకు సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలి.

ప్రత్యామ్నాయ పద్ధతులైన సస్యరక్షణ పద్ధతులను పాటించాలి.

తెల్లచౌడు నేలలు: వేసవి కాలంలో కొన్ని నేలలు ఉపరితలంపైన తెల్లటి పొరలాగా నీటిలో కరిగే లవణాలతో పెరుకోని ఉంటుంది. ఈ భూముల్లో విత్తిన గింజలు సరిగ్గా మొలకెత్తవు. మొలకెత్తిన పైరు కూడా పెరగదు. పొలంలో మొక్కల సాంద్రత కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఈ సమస్యను అధిగమించేందుకు భూమిపైన పేరుకొన్న ఉప్పును పారతో చెక్కి తీసి వేయాలి. అంతేకాకుండా పొలాన్ని చిన్న చిన్న మడులుగా చేసుకోని పదిహేను సెం.మీ. లోతు నీరు నిలువ ఉండేటట్లు సాగు నీటిని పెట్టాలి. ఇలా ఆ నీటిని నాలుగు లేక ఐదు రోజులు నిలువ ఉంచి భూమిలో ఇంకనియాలి. తర్వాత మురుగు నీటిని లోతైన కాలువల ద్వారా తీసి వేయాలి. ఈ విధంగా మూడు నుండి నాలుగు సార్లు చేస్తే చౌడు తీవ్రత చాలా వరకు తగ్గుతుంది. అంతేకాకుండా పచ్చిరొట్టె ఎరువులైన జనుము, జీలుగ వంటి పంటలను పెంచి నలభై నుండి యాభై రోజుల తర్వాత భూమిలో కలియదున్నడం ద్వార కూడా చౌడును నివారించవచ్చును.

కారు చౌడు నేలలు: ఈ కారు చౌడు నేలల్లో వేసవి కాలంలో పైన నలువు లేక బూడిద రంగు పొరను చూడవచ్చు. వీటిలో మార్పిడి జరిగే సోడియం పదిహేను శాతం కంటే ఎక్కువ ఉంటుంది. అందువల్ల కొద్దిపాటి వర్షం వచ్చినా, నీరు త్వరగా భూమిలోకి ఇంకదు. ఎండినప్పుడు నేల చాలా గట్టిగా ఉంటుంది. సేద్యానికి అనుకూలంగా ఉండదు. ఈ నేలల్లో నీరు ఇంకే స్వభావం తక్కువ కాబట్టి మొదటగా పొలాన్ని చిన్న చిన్న మడులుగా చేసుకోని మడుల నుండి మురుగు నీరు పోయేలా లోతైన కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా వేసుకోవాలి. భూసార పరిక్ష అందుబాటులో లేనప్పుడు ఎకర సుమారుగా రెండు టన్నుల జిప్సాన్ని ఒకే దఫాగా వేయాలి. ప్రెస్ మడ్ కూడా జిప్సంకు బదులుగా వాడవచ్చు.

**ఆమ్ల నేలలు:**

ఈ నేలలు ఉదజని సూచిక ఆరు కన్న తక్కువగా ఉంటుంది. పైన చూడటానికి ఈ నెలలు తెలికగా, ఎర్రగా కనబడుతాయి. ఈ నేలలను బాగు చేయడానికి సున్నం లేదా వ్యర్థ పదార్థంగా మిగిలే బేసిక్ స్లాగ్ మరియు ప్రెస్ మడ్ ను వాడవచ్చును. భూసార పరీక్ష అందుబాటులో లేనప్పుడు ఎకరాకు మూడు క్విం. పొడి చేసిన సున్నాని సాళ్ళల్లో వేస్తే సరిపోతుంది.

**సున్నం అధికంగా గల నేలలు:**

ఈ నేలల్లో భాస్వరం ఎరువు వినియోగ సామర్థ్యం అతి తక్కువగా ఉండటమే కాకుండా సూక్ష్మపోషక పదార్థాలైన జింకు, ఇనుము, మాంగనీస్, రాగి లోపాటు సర్వసమాన్యంగా కనిపిస్తాయి. ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువు వేసి పంట నష్టాన్ని తగ్గింవచ్చు. అంతేకాకుండా ఈ నేలల్లో జనుము, జీలుగును పచ్చి రొట్టె పైర్లుగా పెంచి నేలలో కలియదున్ని మురిగెలా చేస్తే సున్నపు దుష్ప్రభావాలు కొంతవరకు తగ్గిపోతాయి.

నేల సారాన్ని కోల్పోవడం అంటే దేశానికి వెన్నుముకైన రైతు వెన్నులో వనుకు పుట్టించే విషయం

నేల సారాన్ని పెంచే సూక్ష్మజీవుల సమూదాయాన్ని నేలలో పెంచి వికసించే సుందర సింధూర మందారమైన మట్టి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం రైతు కన్నీటికి చరమగీతం పాడుదాం



- సంగర్తి హరీష్.ఎమ్మెస్సీ అగ్రికల్చర్.
డిపార్ట్ మెంట్: వ్యవసాయ సూక్ష్మ జీవశాస్త్రం మరియు జీవఉత్పత్తి విభాగం.
సెల్:-8500598177.
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం.
రాజేంద్రనగర్.. హైదరాబాద్..

# ఎన్నికల నిర్వాహణకు అన్ని అన్ని ఏర్పాట్లకు చర్యలు

## ఎన్నికల అధికారులకు శిక్షణలో జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్,జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి

రంగారెడ్డి జిల్లా,డిసెంబర్05(నమస్తే ఉదయం)ఎన్నికల నిర్వాహణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్,జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి,లు అన్నారు.ఎన్నికల నిర్వాహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజెషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్,జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమక్షంలో పూర్తి చేశారు.శుక్రవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్,జీవన్ పాటిల్,జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రెండవ విడత ర్యాండమైజెషన్ ప్రక్రియను నిర్వహించారు.జిల్లాలో నిర్వహించే గ్రామ



పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్,అధికారులను,ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు.వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వాహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు.రెండవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి ఈనెల తొమ్మిదో తేదీ వారికి కేటాయించిన మండల కేంద్రాలలో రెండవ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని,ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని అని కలెక్టర్ హెచ్చరించారు.ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ డీపీఓ సురేష్ మోహన్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరైన నిధులను కూడా విడుదల చేయడం లేదు

## ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్ పల్లి, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరైన నిధులను కూడా విడుదల చేయడం లేదని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలో గల కెపిహెచ్బి డివిజన్ గోపాల్ నగర్ లో రూ. 80 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పది ఏళ్ళ కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో నియోజకవర్గంలోని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసుకున్నామని, ఎక్కడికి అక్కడ బీటీ రోడ్లు సిసి రోడ్లు, ఓపెన్ జిమ్ములు, పార్కులు, ఇండోర్ స్టేడియంలు, అండర్పాస్ బ్రిడ్జిలు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని గుర్తు చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు 80% పనులు పూర్తయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు మంజూరైన పనులు కూడా పెండింగ్లో పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దాసరి శ్రీనివాస్ రావు, మైనేని ప్రసన్నల జ్ఞాపకార్థంగా నేడు 25 ప్రత్యేక సేవా కార్యక్రమం

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

## మైత్రి కన్స్ట్రక్షన్స్ ఏండి, సీనియర్ జర్నలిస్ట్ దాసరి రాహుల్ ప్రదీప్



కూకట్ పల్లి, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం) నేడు భాగ్యనగర్ కాలనీ లోని ఆంధ్రప్రభ కార్యాలయం వద్ద జరగనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మైత్రి కన్స్ట్రక్షన్స్ ఏండి, సీనియర్ జర్నలిస్ట్ దాసరి రాహుల్ ప్రదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. దాసరి శ్రీనివాస్ రావు, మైనేని ప్రసన్న ల జ్ఞాపకార్థంగా ప్రతి శనివారం అన్నదాన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నేటితో 25వ శనివారంగా ప్రత్యేక సేవ కార్యక్రమాన్ని నిర్వహించాలనే సంకల్పంతో ప్రత్యేకంగా ప్రజల కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్లోబల్ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహిస్తున్నామని రాహుల్ ప్రదీప్ తెలిపారు. ఈ శిబిరంలో సమగ్ర కంటి పరీక్షలు, దృష్టి శక్తి తనిఖీ, గ్లాకోమా, కంటిచూపు తగ్గుదల వంటి సమస్యల గుర్తింపు, ప్రాథమిక చికిత్సలు, అలాగే అవసరమైతే తదుపరి వైద్య సూచనలు, తక్కువ దృష్టి ఉన్నవారికి ప్రత్యేక కౌన్సిలింగ్ వంటి సేవలు పూర్తిగా ఉచితంగా అందించబడతాయని అన్నారు. ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా కంటి ఆరోగ్యం అత్యంత ముఖ్యమని భావిస్తూ, మా సేవా ప్రయాణంలో ఈ శిబిరం మరో ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని, సమీప ప్రాంత ప్రజలు, వయోజనులు, మహిళలు, యువతు అవసరం ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రయోజనం పొందాలని రాహుల్ ప్రదీప్ మనస్ఫూర్తిగా కోరారు.



# బాలానగర్ పోలీసుల ముమ్మర తనిఖీలు

## రూ. లక్షకు పైగా చలాన్లు వసూలు....19 వాహనాలు సీజ్

## నూతన సంవత్సర వేడుకలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకే నాకాబంది.. బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి, సీఐ నర్సింహా రాజు

బాలానగర్, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం) రానున్న నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ లక్ష్యంగా సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు బాలానగర్ డివిజన్ పరిధిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్, నాకా బంధీ నిర్వహించారు. గురువారం రాత్రి బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ గిరి ప్రసాద్ పర్యవేక్షణలో బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో రంగారెడ్డి నగర్, రాజు కాలనీ దుర్గామాత గుడి ప్రాంతాలలో రాత్రి 9 గంటల నుండి 12 గంటల వరకు నాకాబందీ చేపట్టారు.

**ముమ్మర తనిఖీలు... పెద్ద సంఖ్యలో పోలీసులు:**

ఈ స్పెషల్ డ్రైవ్‌లో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి పర్యవేక్షణలో ఏకంగా 60 మందికి పైగా పోలీస్ అధికారులు పాల్గొన్నారు. పోలీసులు ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను విస్తృతంగా తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులపై జరిమానాలు విధించడంతో పాటు కొన్ని వాహనాలను సీజ్ చేశారు.

**రూ. 1,04,095/- చలాన్లు వసూలు:**

ఈ స్పెషల్ డ్రైవ్‌లో బాలానగర్ పోలీసులు మొత్తం 643 వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో 79 వాహనాలకు సంబంధించిన పెండింగ్ చలాన్ల రూపంలో రూ. 1,04,095/- వసూలు చేసినట్లు సీఐ నరసింహా రాజు తెలిపారు. తనిఖీ చేసిన వాహనాల్లో 90 కార్లు, 39 ఆటోలు, 514 ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. అంతేకాక, సరైన పత్రాలు లేని 19 వాహనాలను జప్తు చేసినట్లు సీఐ వెల్లడించారు.

**భవిష్యత్తులోనూ కొనసాగుతాయి:**

అనంతరం ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ తరహా తనిఖీలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు విధిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాహన యాజమానులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని, నిబంధనల మేరకు నంబర్ ప్లేటు ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# సాయుధ దళాల పతాక దినోత్సవం 2025






హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే ఉదయం) తెలంగాణ ప్రభుత్వం సైనిక్ సంక్షేమ శాఖ 2025 సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని హైదరాబాద్ లోని సైనిక్ వెల్ఫేర్ డైరెక్టరేట్ , రాష్ట్రంలోని పది (10) ప్రాంతీయ సైనిక్ వెల్ఫేర్ కార్యాలయాలలో మాజీ సైనికులు, వారి కుటుంబాలు , ఎన్ సి సి క్యాడెట్ల సహాయంతో జరుపుకున్నారు. మాజీ సైనికులు, కుటుంబాల పునరావాసం కల్పించడానికి 1949 సంవత్సరంలో సాయుధ దళాల పతాక దినోత్సవ నిధిని స్థాపించారు. జిష్ణు దేవ్ వర్మ , గవర్నర్ , సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి చైర్మన్, సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా విరాళం ఇవ్వడం ద్వారా ప్రారంభించారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి కి సీఎం రేవంత్ రెడ్డి 1 లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ సందర్భంగా కల్నల్ రమేష్ కుమార్ సంకలనం చేసిన 75 మంది గ్యాలంట్రీ అవార్డు గ్రహీతల జీవిత కథలతో కూడిన "బ్రేవ్ అండ్ బోల్డ్' పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సి.వి. ఆనంద్ , సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి , సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చినందుకు గెజిటెడ్ , నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, క్లాస్ 4 ఉద్యోగులు, సెక్రటేరియట్ ఉద్యోగులు, డ్రైవర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు , తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఎస్బిఐ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహించడంలో నిరంతర మద్దతు ఇచ్చినందుకుఎన్ సి సి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అన్ని గ్రూప్ బెటాలియన్ కమాండర్లు , ఎన్ సి సి క్యాడెట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, శ్రీనేష్ కుమార్, నరోత్తమ్ రెడ్డి, కెప్టెన్ శ్రీనివాసులు పాటు ఇతర అధికారులు ఉన్నారు.



యాదవ రెడ్డి మృత దేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షురాలు

## చెంచారపు యాదవ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

### సంతాపం తెలిపిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 05(నమస్తే ఉదయం): కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంచారపు యాదవ రెడ్డి శుక్రవారం ఉదయం మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్ జనగామ పట్టణంలో బాణపురం లో వారి నివాసం వద్ద వారి పార్థివ దేహాన్ని సందర్శించి పూల మాల వేసి సంతాపం ప్రకటించారు. సంతాపం తెలిపిన వారిలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మారుజోడు రాంబాబు, పీసీసీ మెంబర్ డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ బనుక శివరాజ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మెన్ ఎర్రమల్ల సుధాకర్, మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల కళ్యాణి, జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరా, జనగామ పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి వంగాల మల్లారెడ్డి , చెంచారపు కరుణాకర్ రెడ్డి, వార్డు అధ్యక్షులు మల్లారెడ్డి, రఘు గౌడ్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు ఇస్తారి శ్రీలత, అండాలు, సక్కుబాయి, పలువురు ప్రముఖులు ఉన్నారు.



## పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిది

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 5(నమస్తే ఉదయం) సీఎం రిలీఫ్ ఫండ్ పేదల వైద్యానికి వరం లాంటిదని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సీఎం రిలీఫ్ ఫండ్ , ఎల్‌ఓసి చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఒకటి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు, నాలుగు ఎల్వోసీలను లబ్ధిదారులకు అందజేశారు. 7,10,000 విలువగల చెక్కులు

133వ డివిజన్ %-% మచ్చ బొల్లారం
వరలక్ష్మి కి1,50,000,
136వ డివిజన్ %-% నేరేడ్‌మెట్
చిట్టెమ్మ 1,50,000,
కె. మురళీధర్ సీఎంఆర్ఎఫ్ 60,000,
137వ డివిజన్ %-% వినాయక్ నగర్
పి. సాయిలు 1,50,000,
141వ డివిజన్ %-% మల్కాజ్గిరి
కె. సిద్ధార్థ్ 2 లక్షలు చెక్కులు, ఎల్‌ఓసిలు అందజేశారు

ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ ...ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ సహాయాన్ని వేగంగా అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా ఎల్లప్పుడూ కృషి చేస్తామని చెప్పారు. ప్రతి కుటుంబం సంక్షేమం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దీని ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ

కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, కరంచంద్ ,జీకే హనుమంతరావు, మధుసూదన్ రెడ్డి, డోలి రమేష్, శోభన్ బాబు,తులసి సురేష్ సర్వే నరేష్ ఫరీద్, చిందం శ్రీనివాస్ రెడ్డి, శివ గౌడ్, సాయి గౌడ్ ,సుమన్ గౌడ్ ,రమేష్ ,రవీందర్, సంపత్ యాదవ్ , పవన్ , లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






## "నమస్తే ఉదయం" వార్త ఎఫెక్ట్

## జనగామ ఆర్టిసి కార్గో లాజిస్టిక్ సెంటర్లో తూకం మిషన్ను సీజ్ చేసి కేసు నమోదు

### అక్రమం పై స్పందించిన జిల్లా తూనికల, కొలతల జిల్లా అధికారిణి పి.ఝాన్సి

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 05 (నమస్తే ఉదయం) : మార్కెట్లో ఉన్న వ్యాపారస్తుల తూనికలు కొలతలలో తేడాలు వస్తే సహించేది లేదని జనగామ జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారిని పి. ఝాన్సి హెచ్చరించారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో ఒక వినియోగదారుడు ఆర్టిసి కార్గో సెంటర్లో తూకంలో మోసం జరిగినట్లు గ్రహించి నిర్వాహకులతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో నమస్తే ఉదయం ను సంప్రదించగా శుక్రవారం పత్రికలో ప్రచురణ కాగా దాని ప్రభావంతో జనగామ ఆర్టిసి డిపో మేనేజర్ కార్గో సెంటర్ ను తనిఖీ చేసి ఒక వేయి రూపాయల జరిమానా విధించారు. అనంతరం శుక్రవారం సాయంత్రం జిల్లా తూనికల కొలతల జిల్లా అధికారిని పి.ఝాన్సీ ఆర్టిసి కార్గో సెంటర్లో ఉన్న తూకం మిషన్లో ప్రభుత్వ ఆమోధిత బాట్లతో తూకం వేయగా తూకంలో అవకతవకలు ఉన్నట్లు వచ్చిందని తెలిపారు. వెంటనే ఆ తూకం మిషన్ను సిజ్ చేసి కేసు నమోదు చేసినట్లు జిల్లా అధికారిణి తెలిపారు. ఆ వినియోగదారుడు తమ సమస్యకు వెంటనే స్పందించి ఆర్టిసి కార్గో నిర్వాహకుల పై చర్యలు తీసుకున్నందుకు అధికారులకు, నమస్తే ఉదయంకు కృతజ్ఞతలు తెలిపారు.

## శివరాంపల్లి ఊర చెరువు, నర్సా బాయి కుంట, నూరు మొహమ్మద్ కుంటలను పరిశీలించిన హైడ్రాధికారులు

### చెరువులు ఎఫ్ టి ఎల్ పరిధిలో నిర్మాణాలు తొలగిస్తాం : హైడ్రా అధికారులు

రాజేంద్రనగర్, డిసెంబర్ 5(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి ఊర చెరువు, నర్సభాయి కుంట చెరువులను హైడ్రాధికారులు పరిశీలించారు. శుక్రవారం తెలంగాణ జాగృతి అధ్యక్షులు కవిత శివరాంపల్లి చెరువు, నూర్ మొహమ్మద్ కుంట, నర్సభాయి చెరువులు ఆక్రమణకు గురయ్యా అని ఫిర్యాదు చేయటంతో హైడ్రా అధికారులు చెరువులను సందర్శించి పరిశీలించారు. హైడ్రా అధికారులు శివరాంపల్లిలోని పై చెరువులను పరిశీలించడానికి ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ అధికారులతో తనిఖీ చేసి ఏ మేరకు చెరువులు ఎఫ్టిఎల్ పరిధిలో ఆక్రమణకు గురయ్యాయో నివేదిక తయారు చేస్తామని అధికారులు తెలిపారు. హైడ్రా అధికారులతో పాటు, రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి చలసాని విష్ణుమూర్తి , నాగని ప్రకాష్, ఎర్ర శ్రీశైలం గౌడ్, షేక్ సలావుద్దీన్ నాయకులు వారి వెంట పాల్గొన్నారు. ఊర చెరువు ,నూరు మొహమ్మద్ కుంట, నర్సభావి, శిలాంచెరువు లపై 26వ తేదీ నవంబర్ లో జాగృతి అధ్యక్షురాలు కవిత ఇచ్చిన ఫిర్యాదిపై హైడ్రాధికారులు స్పందించారని స్థానిక నాయకులు తెలిపారు. ఈ చెరువుల ను రెవెన్యూ అధికారుల తో కలిసి రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.




శివరాంపల్లి ఊర చెరువు మ్యాప్ ను పరిశీలిస్తున్న హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు,

## పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి

### జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి


పటాన్ చెరు,డిసెంబర్ 5 (నమస్తే ఉదయం): త్వరగా జరగనున్న పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పాలని జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదలలోఎన్నికల ప్రచార హోరు నల్లవల్లి లో బలపరిచిన అభ్యర్థి అనిత శ్రీనివాస్ తరపున నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో కొలన్ బాల్ రెడ్డి పాల్గొన్నారు. నల్లవల్లి ఎన్నికల ఇంఛార్జ్ గా ప్రచారంలో బాల్ రెడ్డి ఫుట్ బాల్ చేతబట్టి తమ అభ్యర్థి అనితను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బెదిరింపులకు దిగితే గ్రామ ప్రజలకు నేను అండగా నిలబడతానని ఆయన భరోసా ఇస్తున్నారు. ఏ మొహం పెట్టుకుని కాంగ్రెస్ వాళ్ళు గ్రామాల్లో ఓట్లు అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. నల్లవల్లి సాక్షిగా గుమ్మడిదల మండలంలో మెజారిటీ గ్రామ పంచాయతీలు గెలిచేది బిఆర్ ఎస్ బలపరిచిన అభ్యర్థులేనని కొలన్ బాల్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.





## శాంతి భద్రతలో భాగంగా నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అవసరం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (అల్వాల్ సర్కిల్ )డిసెంబర్ 05 (నమస్తే ఉదయం): శాంతి భద్రతలో భాగంగా నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అత్యంత కీలకపాత్రను పోషిస్తాయని అల్వాల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ అన్నారు. శుక్రవారం బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అత్యంత కీలకపాత్రను పోషిస్తాయని అన్నారు. నేరాలు నియంత్రణలో ఉండేందుకు అన్ని కాలనీల ప్రజల సహకారంతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడతారని ఆయన తెలిపారు. అనంతరం దేవస్థానం వారు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాఘవేందర్ రెడ్డి పోలీస్ సిబ్బంది ,ఆలయ సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి

### దేవాలయంలో పూజలు చేయడం వలన మానసిక ప్రశాంతత కలుగుతుంది. చింతల వెంకట్ రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) డిసెంబర్ 05 ( నమస్తే ఉదయం): అల్వాల్లో శుక్రవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో పూజలు చేయటం వలన మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆయన తెలిపారు. అర్చకులు సాదరంగా ఆహ్వానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.




## నాగారం మున్సిపాలిటీని నగరపాలక సంస్థలో కలపడంతో ఆనందం వ్యక్తం చేసిన నాయకులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (నాగారం సర్కిల్) డిసెంబర్ 05 (నమస్తే ఉదయం): పట్టణీకరణలో భాగంగా నగర అభివృద్ధికై మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలను గ్రేటర్ హైదరాబాదులో విలీనం చేయడంతో రాత్రికి రాత్రే అన్ని మున్సిపాలిటీ నగరపాలక సంస్థలకు మహానగరపాలక సంస్థగా బోర్డులు మారాయి. శుక్రవారం నాగారం మహానగర పాలక సంస్థ కార్యాలయం వద్ద పలు రాజకీయ పార్టీల నాయకులు సమావేశమయ్యారు. అందులో పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ...గతంలో నాగారం గ్రామపం చాయతీగా ఉండేదన్నారు. అభివృద్ధిలో భాగంగా గ్రామపంచాయతీలు గత ప్రభుత్వ హాయంలో మున్సిపాలిటీగా మారిన విషయం అందరికీ విదతమే అన్నారు. ఇంకొక టరుము మున్సిపాలిటీగా ఉంటేనే బాగుంటుంది అని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న నాగారం మున్సిపాలిటీ పట్టణీకరణలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ లో కలపడం వలన స్థానిక ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునర్ పరిశీలన జరిపి మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం చేయకపోతేనే బాగుంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం నగర పాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ పంగా హరిబాబు, మాజీ కౌన్సిలర్ బిజెపి నాయకులు వేణు, మాజీ వార్డు సభ్యులు బిఆర్ఎస్ నాయకులు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్, మాజీ రెడ్డి వెంకట్ రెడ్డి, మాదిరెడ్డి రాజిరెడ్డి, గణపురం కొండల్ రెడ్డి, అన్నెపు రాజు, సురేష్, సతీష్ గౌడ్, మునిగాల మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడ మున్సిపాలిటీ నగరపాలక సంస్థలు విలీనంతో అభివృద్ధి: పాండాల యాదగిరి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( దమ్మాయిగూడ సర్కిల్ ) డిసెంబర్ 05 ( నమస్తే ఉదయం ):- నగర అభివృద్ధిలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ ని మహానగర పాలక సంస్థగా మారడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రజా పరిపాలనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు మేలు జరిగే విధంగా ఉన్నాయని చెప్పారు. పట్టణ సుందరీకరణలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ మహానగర పాలక సంస్థలో విలీనం చేయడం వలన మరింత అభివృద్ధి జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ నుండి మున్సిపల్ గా మారి మహానగర పాలక సంస్థలోకి రావడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల శ్రీనివాస్ రెడ్డి, చక్రధర్, కర్ల చంద్రయ్య , సాగర్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ , నితిన్, సుధాకర్, కె. ఎస్. ఎన్. వి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.




దమ్మాయిగూడ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద పలు పార్టీల రాజకీయ నాయకులు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733